9th
- HAPPY -
ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 298 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శనివారం 6 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తాం

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ

- నిరుద్యోగ యువత నిరసనలపై స్పందించిన ముఖ్యమంత్రి
- పార్టీకి చెందిన విద్యార్థి, యువత, నేతలు, అధికారులతో చర్చలు
- ఉద్యోగ భర్తీకి కృతనిశ్చయంతో ఉన్నట్లు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత నిరసనలపై ఆయన శుక్రవారం స్పందించారు. వారి ఆందోళనలు, డిమాండ్లపై చర్చించారు. పార్టీకి చెందిన విద్యార్థి, యువజన, నేతలు, అధికారులతో ఆయన చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కొన్ని పార్టీలు, స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావొద్దని సూచించారు. అసెంబ్లీ సమావేశాలలో చర్చించిన అనంతరం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

**నిరుద్యోగులకు మేలు చేస్తాం..**

ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో కృతనిశ్చయంతో ఉన్నామన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. తప్పకుండా నిరుద్యోగులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు, స్వార్థపూరిత శక్తులకు నిరుద్యోగులు బలి కావొద్దని సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ ముందుకెళ్తున్నామని చెప్పారు. గత సర్కార్ లా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే నోటిఫికేషన్లు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు సీఎం రేవంత్. ఇప్పటికే 28,942 ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు.

ఏళ్లకు ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 నియామకాలకు ఉన్న కోర్టు చిక్కులన్నింటిని అధిగమించిందని చెప్పారు.

జాబ్ క్యాలెండర్ ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి, ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లోనే చర్చించి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు సీఎం. నిరుద్యోగుల సమస్యలపై నేతలతో సీఎం రేవంత్ సమావేశం అయ్యారు. నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కారంపై CS, అధికారులతో సీఎం చర్చించారు.

## హైదరాబాద్ కు చంద్రబాబు.. భారీ ర్యాలీ... నగరం పసుపుమయం

ఢిల్లీ పర్యటన ముగిశాక బేగంపేటకు చేరుకున్న ఏపీ సీఎం

కారులో నుంచి అభివాదం చేసిన చంద్రబాబు

జూబ్లీహిల్స్‌లోని తన నివాసం వరకు ర్యాలీగా వెళ్లిన టీడీపీ అధినేత



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌కు చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయంలో ఆయనకు తెలంగాణ టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. కారులో నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన అభివాదం చేశారు. బేగంపేట నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసం వరకు అభిమానులతో ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఢిల్లీ పర్యటన ముగియడంతో ఆయన నేరుగా హైదరాబాద్ చేరుకున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు ప్రజా భవన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన సమావేశం కానున్నారు. హైదరాబాద్ నగరమంతా చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతూ టీడీపీ నేతలు ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేశారు. విభజనకు సంబంధించి అపరిష్కృతంగా

వివరాలు 2లో..

## కేశవరావు రాజీనామాకు ఆమోదం



- రాజీనామాను ఆమోదించిన రాజ్యసభ ఛైర్మన్
- రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయిందని బులెటిన్ విడుదల
- ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన కె.కేశవరావు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన తెలంగాణ సీని యర్ నాయకుడు కె.కేశవరావు రాజీనామాను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆమోదించారు.

వివరాలు 2లో..

## దేశ ప్రజల కోసం మోదీ ఏనాడైనా జైలుకు పోయారా?




**హైదరాబాద్ పెన్ పవర్:**మోడీ మూడు సార్లు ప్రధానిగా గెలిచినా ఎన్నడూ జైలుకు పోలేదన్నారు కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి. దేశ ప్రజల మేలు కోసం కొన్ని గంటలైనా జైలు జీవితం గడిపారా? అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య ఉద్యమం కోసం నెహ్రూ 3259 రోజులు జైలు జీవితం గడిపారని అన్నారు.

వివరాలు 2లో..

## ఫార్మా రంగానికి కేంద్రంగా హైదరాబాద్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫార్మా రంగానికి హైదరాబాద్ కేంద్రంగా మారిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.- హైటెక్స్ లో ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాన్ఫరెన్స్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్ధిళ్ల శ్రీదర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఫార్మా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. దేశ విదేశాలకు హైదరాబాద్ నుంచి ఎగుమతులు జరుగుతున్నాయని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, పెట్టుబడిదారులకు అన్ని రకాల సౌకర్యం కల్పిస్తామని ఆయన అన్నారు. టెక్నాలజీ

వివరాలు 2లో..



## రేవంత్ రెడ్డికి యువత అంటే ప్రేమ లేదు

- నిరుద్యోగులు అంటే రేవంత్ రెడ్డికి గౌరవం లేదని మండిపాటు
- నిరుద్యోగ యువతను నమ్మించి మోసం చేసిన నయవంచక సర్కార్ ఇది అని ఆగ్రహం
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోమని చెబితే నిర్బంధమా? అని ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి యువత అంటే ప్రేమ లేదని, నిరుద్యోగులు అంటే అసలే గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 2లో..




## మీ ఆగ్రహం నన్ను తాకింది

### ప్రధానిగా చివరి ప్రసంగంలో రిషి సునాక్ భావోద్వేగం

- ప్రధానిగా చివరి ప్రసంగం... రిషి సునాక్ భావోద్వేగం
- ప్రజల ఆగ్రహం తనను తాకిందన్న రిషి సునాక్
- ప్రభుత్వం మారాలని ప్రజలు స్పష్టమైన సందేశమిచ్చారని వ్యాఖ్య
- ప్రజలకు క్షమాపణలు చెప్పిన రిషి
- ఓడిపోయినందుకు పార్టీ నేతలకూ క్షమాపణలు



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రధానిగా చివరి ప్రసంగంలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ భావోద్వేగానికి లోనయ్యారు. బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో రిషి సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. దీంతో ఓటమికి ఆయన బాధ్యత వహించారు. పదవి నుంచి దిగిపోవడానికి ముందు ఆయన తన అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్ ముందు నిలబడి ప్రధాని హోదాలో చివరి ప్రసంగం చేశారు. ప్రజల ఆగ్రహం తనను తాకిందని భావోద్వేగానికి లోనయ్యారు. తొలుత మీ అందరికీ క్షమాపణలు చెబుతున్నానని బ్రిటన్ ప్రజలను ఉద్దేశించి అన్నారు. ప్రధానిగా తన బాధ్యతలను

వివరాలు 2లో..

## బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలె.. లెఫ్ట్ పార్టీల మహా ధర్నా




### బ్లాకులను నేరుగా సింగరేణికి అప్పగించాలె

### సింగరేణి భవన్ వద్ద లెఫ్ట్ పార్టీల మహా ధర్నా

**హైదరాబాద్ పెన్ పవర్:** బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని సింగరేణి వ్యాప్తంగా లెఫ్ట్ పార్టీల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. లక్డికపూల్ లోని

వివరాలు 2లో..

## నీట్ పరీక్షపై సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం

- నీట్ పేపర్ లీకేజిపై దేశవ్యాప్తంగా దుమారం
- సుప్రీంకోర్టులో విచారణ
- నీట్ పరీక్ష రద్దు చేసేది లేదన్న కేంద్రం
- ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడి
- నీట్ రద్దు చేస్తే లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారని వివరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**జాతీయ స్థాయిలో వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో దేశవ్యాప్తంగా దుమారం రేపింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ విచారణలో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ పరీక్షను రద్దు చేసేది లేదని తేల్చి చెప్పింది. పోటీ

వివరాలు 2లో..



## టూరిస్ట్‌లను ఆకర్షించేలా నల్లమల : పర్యాటక శాఖ మంత్రి జూపల్లి



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని టూరిస్ట్?లను ఆకర్షించే విధంగా నల్లమల అడవులను అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నల్లమలలోని పర్యాటక ప్రాంతాలను గుర్తించేందుకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి కృష్ణారావు ఇవాళ అచ్చంపేట నుంచి బయలుదేరారు. ముందుగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమామహేశ్వరం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మొదటి విడతగా

వివరాలు 2లో..

# సంపాదకీయం

## గరీబ్

అబ్రహం లింకన్, నెల్సన్ మండేలా, స్టీవ్ జాబ్స్, అబ్దుల్ కలామ్, రజనీకాంత్ వీళ్ళందరూ పేద కుటుంబంలో పుట్టారు. పేదోళ్ల గా పుట్టడం తప్పు కాదు.. పేదవాళ్లుగా చావటం తప్పు. ఈ దేశంలో గవర్నమెంట్ ఇచ్చే ఫ్రీ స్కీములు తీసుకుని చాలామందికి పేదోడిగా బతకడం అలవాటైపోయింది. గవర్నమెంట్ వాళ్లకి ఎండ్లేస్ గా హెల్ప్ చేయటం అనేది కరెక్ట్ కాదు. అందుకే చిన్న చిన్న మార్పులు రావాలి. వైట్ కార్డు ఉన్నవాళ్లకి ఓటు హక్కు రద్దు చేయాలి. నీ జీవితమే నీకు బరువుగా ఉన్నప్పుడు, ఒక లీడర్ జీవితం నీ చేతిలో ఎలా పెట్టమంటావ్ అని అడగాలి. నీకు రేషన్ ఫెసిలిటీ కావాలంటే నువ్వు ఓటు కోల్పోతావ్ అని చెప్పాలి. చెప్తే వాడికి ఏది అవసరమో ఆలోచిస్తాడు. అప్పుడు నిజంగా కష్టాల్లో ఉన్నవాడే వైట్ కార్డు తీసుకుంటాడు. ఓటు హక్కే కావాలనుకున్న వాళ్ళు దానికోసం లైఫ్ లో ఎక్కువ కష్టపడతాడు. ఓటు లేకపోతే సారా ప్యాకెట్ ఉండదు. సారా ప్యాకెట్ తో లీడర్ నీ డిసైడ్ చేసే బ్యాచ్ ఎలక్షన్ కి ముందే కట్ అయిపోతుంది. లేకపోతే మన నాయకులు జీవితాలు తాగుబోతుల చేతుల్లో ఉంటాయి. పేద పిల్లలందరికీ మినిమం ఎడ్యుకేషన్ ఇవ్వడం గవర్నమెంట్ బాధ్యత. కానీ తర్వాత హైయర్ ఎడ్యుకేషన్ కావాలంటే లోన్ ఇచ్చి దాన్ని రీపే చేయమని గవర్నమెంట్ అడగాలి తర్వాత వాడు ఉద్యోగం చేసి గవర్నమెంట్ అప్పు తీర్చాలి. గవర్నమెంట్ ఫండ్ ప్రతి రూపాయి అప్పు అని తెలిస్తే. స్టూడెంట్స్ ఒళ్ళు దగ్గర పెట్టుకుని చదువుతారు. అలాగే రిజర్వేషన్స్ కూడా కులాన్ని బట్టి ఇవ్వకూడదు. పేదవాడు ఏ కులంలో ఉన్న సపోర్ట్ చేయాలి. వాళ్ల పిల్లలు చదువుకునేలా చేయాలి. బట్ వాళ్లు తిరిగి వైట్ కార్డు గవర్నమెంట్ హ్యాండోవర్ చేసిన రోజే వాళ్లకి ఓటింగ్ ఫెసిలిటీ రావాలి. బూతులో ఓటు వేసే ప్రతి ఇండియన్ ఇండివిజువల్ గా స్ట్రాంగ్ అయి ఉండాలి. అలాగే ఫ్యూచర్లో నిరీక్షణకు ఓటింగ్ ఇవ్వకూడదు. ఓటు వేయాలంటే మినిమం ఎడ్యుకేషన్ మెట్రిక్యులేషన్ పాస్ అయి ఉండాలి. పుట్టాం కదా గుద్దేస్తావంటే కుదరదు. అందరూ ఓటు హక్కు సంపాదించుకోవాలి, ప్రభుత్వాన్ని,లీడర్స్ ను అడుక్కోవడం మానేద్దాం. ప్రపంచంలో ఏ జంతువు ఇంకో జంతువు దగ్గర చేయి చాచదు. తిండి కోసం కష్టపడుతుంది లేదా చస్తది. నీ జాతిని తిడితే నీకు కోపం వస్తుంది కదా? అలాంటప్పుడు అదే జాతిని కించపరుస్తూ పేదోళ్ల ప్రభుత్వం ముందు నుంచుంటున్నావ్ తప్పు కాదా? కష్టపడు నీ జాతి తలెత్తుకునేలా చెయ్ మా జాతికి రిజర్వేషన్ వద్దు వేరే వాళ్ళకి ఇవ్వండి అని ప్రభుత్వానికి చెప్పేలా ఉందాం. అప్పుడు మారుద్ది ఇండియా. నా కాలు చెయ్యి బాగున్నాయి... మనం చెయ్యి చాచొద్దు మోకాళ్ళ మీద ఉంచవద్దు, బాగున్నాయి ఒక్క సవాల్ నా ఒక్క కుటుంబాన్ని పెంచలేనా.. నేను ఎవ్వడి కోసం ఎదురు చూడను, నా కాల మీద నిలబడతా! ఆ ఏంటి ఆ ట్రైన్ పేరేంటి? గరీబ్ ఎక్స్ప్రెస్ ఆ నా దేశంలో ఆ ట్రైన్ కి ఆ పేరేంటి తీసేయ్. నా సంస్కృతి రిచ్, నా సంప్రదాయం రిచ్, అని మనందరం చెప్పేలా ఉందాం.

జై హింద్..

## తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారిగా సుదర్శన్ రెడ్డి




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుత సీఈవో వికాస్ రాజ్‌ను ఈసీ రిలీవ్ చేసింది. సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం జీఏడీ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు.

## బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలె..

# లెఫ్ట్ పార్టీల మహా ధర్నా

- మొదటి పేజీ తరువాయి

సింగరేణి భవన్ వద్ద జరిగి ధర్నాలో లెఫ్ట్ పార్టీల ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలన్నారు. బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు ఆందోళనకు దిగారు. సింగరేణికి నామినేషన్ పద్ధతిలో గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లిలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. సింగరేణిని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు.

సింగరేణి జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణిని కాపాడుకోవడుకోవడానికి అవసరమైతే తెలంగాణ బంద్ కు కూడా పిలుపునిస్తామని తెలిపారు.

# మీ ఆగ్రహం నన్ను తాకింది

## ప్రధానిగా చివరి ప్రసంగంలో రిషి సునాక్ భావోద్వేగం

- మొదటి పేజీ తరువాయి

ఏ లోటు లేకుండా నిర్వర్తించానని భావిస్తున్నానని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మారాలని మీరు స్పష్టమైన సందేశం ఇచ్చారని, మీ తీర్పే అంతిమం అన్నారు. మీ ఆగ్రహాన్ని, అసంతృప్తిని నేను పూర్తిగా విన్నాను... ఈ ఓటమికి పూర్తి బాధ్యత తనదేనని భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. గడ్డు పరిస్థితుల తర్వాత ఇది కష్టమైన రోజు అన్నారు. దేశ ప్రధానిగా సేవలు అందించే అవకాశం రావడం గర్వంగా ఉందన్నారు. దేశంలోనే మనది అత్యుత్తమ దేశమన్నారు. ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**పార్టీ నేతలకు క్షమాపణలు**

తమ పార్టీలో చాలామంది ఈసారి సభ్యత్వాన్ని కోల్పోయారనీ, ఇది తనను చాలా బాధించిందని రిషి సునాక్ అన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ

పార్టీ అధినాయకత్వ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. కొత్త నేతను ఎన్నుకునే ప్రక్రియ పూర్తయ్యే వరకు కొనసాగుతానన్నారు. నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్న లేబర్ పార్టీ నేత కీర్ స్మార్టర్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

## ఫార్మా రంగానికి కేంద్రంగా హైదరాబాద్

- మొదటి పేజీ తరువాయి

అభివృద్ధిలో ఏఐ ఎంతో కీలక పాత్ర పోషిస్తోంది. 73వ ఫార్మా కాంగ్రెస్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు అంశాలు మాట్లాడారు. దేశంలో 35 శాతం ఫార్మా ఉత్పత్తులు తెలంగాణ నుంచే ఉన్నాయని అది రాష్ట్రానికి గర్వకారణమని భట్టి అన్నారు. ప్రతి ఏటా 50వేల కోట్ల విలువైన మెడిసిన్ ఎగుమతి చేస్తున్నాం అన్నారు. కోవిడ్ వంటి మహమ్మారి సమయంలో అసమానమైన చురుకుదనం ప్రదర్శించి, అవిశ్రాంతంగా శ్రమించారని ఫార్మసిస్టుల సేవలను ఆయన కొనియాడారు. ఫార్మా పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుంది అన్నారు.

హైదరాబాద్ బిర్యానీకి ప్రసిద్ధి, ఇప్పుడు బిర్యానీతోపాటు బయో ఫార్మా ఉత్పత్తులకు ప్రసిద్ధిగాంచిందని తెలిపారు. అందరికీ ఆరోగ్యం అందుబాటులో తీసుకొస్తే దృఢమైన ప్రపంచాన్ని నిర్మించగలమన్నారు. బౌల్ అఫ్ ఫార్మ గా హైదరాబాద్ స్థిరపడిందన్నారు. సుగంధ ద్రవ్యాలను సరఫరా చేసే స్థాయి నుంచి మానవ జీవితాలను కాపాడే మందుల సరఫరా దశకు తెలంగాణ రాష్ట్రం చేరుకుందన్నారు. ఫార్మా రంగంలో అనేక ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రంగా మారింది అన్నారు.

## కేశవరావు రాజీనామాకు ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీని వీడిన ఆయన మూడు రోజుల క్రితం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మారిన నేపథ్యంలో ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. నిన్న రాజ్యసభ చైర్మన్‌ను కలిసి రాజీనామా లేఖను అందించారు. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయిందని రాజ్యసభ సచివాలయం బులెటిన్‌ను విడుదల చేసింది.

## రేవంత్ రెడ్డికి యువత అంటే ప్రేమ లేదు

- మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. నిరుద్యోగ యువతను నమ్మించి మోసం చేసిన నయవంచక సర్కార్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోమంటే ఇంత నిర్బంధమా?? తెల్ల దొరల పాలన కన్నా..

దుర్మార్గంగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఓ వైపు ప్రజా పాలన అంటూనే... మరోవైపు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపానికి యువతను అక్రమంగా అరెస్ట్ చేస్తారా? అని నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంతటి నిరంకుశ విధానాలను అవలంబిస్తారా?? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజా పాలన కాదు... ముమ్మాటికీ ప్రజాకంతక పాలనే అన్నారు. ప్రచారంలో ఒక మాట.. ప్రభుత్వంలోకి వచ్చాక..

మరో మాట మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రెండు నాల్కల వైఖరి తెలంగాణ యువతకు అర్థమైపోయిందన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారందరిని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలు చేపట్టడంలో.. జాబ్ క్యాలెండర్ ప్రకటించడంలో.. అట్టర్ ఫ్లాప్ అయినందుకు.. వెంటనే నిరుద్యోగులకు.. కాంగ్రెస్ సర్కారు క్షమాపణలు చెప్పాలన్నారు. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చకుండా నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ సర్కారును... ఈ పాపం శాపమై భూస్థాపితం చేయడం ఖాయమని హెచ్చరించారు.

## టూరిస్ట్‌లను ఆకర్షించేలా నల్లమల : పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

- మొదటి పేజీ తరువాయి

రూ, 50 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరం వచ్చే విధంగా ప్రధాన రహదారిపై బోర్డులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజులపాటు నల్లమలలో పర్యటించి పురాతన ఆలయాలతో పాటు టూరిజం పరంగా అభివృద్ధి చేసే ప్రాంతాలను పరిశీలిస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చడంతో పాటు ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం రంగాపూర్ నిరంజన్ షావలి దర్గాను మంత్రులు, ఎమ్మెల్యేలు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## నీట్ పరీక్షపై సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం

- మొదటి పేజీ తరువాయి

పరీక్షలను పారదర్శక రీతిలో నిర్వహిం చేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్రం స్పష్టం చేసింది. నీట్ పేపర్ లీకేజి కేసులో ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేశామని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించామని తన అఫిడవిట్ లో వెల్లడించింది. అయితే, భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్టు ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరించింది. అందువల్ల నీట్ పరీక్ష రద్దు చేయడం సరికాదని అభిప్రాయపడింది. నీట్ పరీక్షను రద్దు చేస్తే నిజాయతీగా పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారని వివరించింది.

## దేశ ప్రజల కోసం మోదీ ఏనాడైనా జైలుకు పోయారా?

- మొదటి పేజీ తరువాయి

నెహ్రూ, ఇందిరా గాంధీ కుటుంబం దేశ ప్రజల భద్రత కోసం చంపబడ్డాయన్నారు. మానవ జీవితం ఉన్నంత వరకు ఆ కుటుంబాన్ని మరిచిపోరని చెప్పారు. ఉన్న ఆస్తులను ప్రజలకు ధారాదత్తం చేసిన చరిత్ర నెహ్రూ కుటుంబానిది అయితే.. గవర్నమెంట్ క్వార్టర్ ను గుంజుకున్న చరిత్ర బీజేపీదని విమర్శించారు జగ్గారెడ్డి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ లో నెహ్రూ, ఇందిరా గాంధీల గురించి చెడుగా మాట్లాడటం బాధకరమన్నారు జగ్గారెడ్డి. రాష్ట్రపతి వ్యాఖ్యలని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. విలువలు లేని రాజకీయాలు చేయడం బిజెపి వాళ్లకు మంచి పద్ధతి కాదన్నారు. ఆశ్రమంలో కూర్చొని కషాయం బట్టలు వేసుకొని ఎంపిలుగా గెలిచిన స్వాములు చరిత్ర గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు జగ్గారెడ్డి. బ్రిటిష్ హయాంలో 200 ఏండ్లు రాచరిక పాలన నడిచిందన్నారు జగ్గారెడ్డి. నెహ్రూ ప్రధాని అయ్యాక డేమోక్రసీని తీసుకొచ్చారని చెప్పారు. ఇందిరా గాంధీ ఉన్నప్పుడు కట్టించిన జాగా, ఇల్లు ఇంకా అందరికి గుర్తుంటదని చెప్పారు. ఏ గ్రామం పోయినా 70 ఏండ్ల వయసు ఉన్న వాళ్ళు.. ఇది ఇందిరమ్మ ఇల్లు, జాగా అంటరు...ఈ విషయం బిజెపి వాళ్ళు తెలుసుకోవాలని సూచించారు జగ్గారెడ్డి.

## టీజీపీఎస్సీ వద్ద పోలీసులు రోడ్డు మీద పోయేవాళ్ళని కూడా అరెస్ట్ చేస్తున్నారు: బీఆర్ఎస్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీజీపీఎస్సీని ముట్టడించిన నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు టీజీపీఎస్సీ వద్ద రోడ్డు మీద పోయేవాళ్ళని సైతం అరెస్ట్ చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. తాము ధర్నా కోసం రాలేదని, రోడ్డు మీద వెళ్తున్నామని చెప్పినా వినిపించుకోకుండా అదుపులోకి తీసుకున్నారంటూ ఒక రైతు, ఒక లాయర్, ఆఫీసుకు వెళ్తున్న ఒక ఉద్యోగి వాపోయారంటూ బీఆర్ఎస్ తన ట్వీట్ లో పేర్కొంది. తమను వదిలిపెట్టాలని వారు పోలీసులను కోరుతున్న వీడియోను కూడా బీఆర్ఎస్ పార్టీ పంచుకుంది. ఈ అరెస్టుల తాలూకు వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

## హైదరాబాద్ కు చంద్రబాబు.. భారీ ర్యాలీ...

# నగరం పసుపుమయం

- మొదటి పేజీ తరువాయి

ఉన్న అంశాలపై ముఖ్యమంత్రులు భేటీ కావడం ఇది మొదటిసారి. ప్రధానంగా షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లోని సంస్థల విభజనపై చర్చించే అవకాశముంది. విద్యుత్ సంస్థలకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య బకాయిలపై చర్చించే అవకాశముంది. తమకు ఏపీ ప్రభుత్వం రూ.24 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలంగాణ చెబుతుండగా, తమకే రూ.7 వేల కోట్లు వస్తాయని ఏపీ చెబుతోంది.

# కేంద్రంలో చంద్రబాబు కీలకంగా ఉన్నారు... ఇద్దరు సీఎంల భేటీలో ఆ అంశంపై చర్చించండి

**తెలంగాణలో మండలి ఉనికి ప్రమాదంలో పడిందన్న వినోద్ కుమార్**

**తెలంగాణలో 153కు, ఏపీలో 225కు అసెంబ్లీ సీట్లను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య**

**చంద్రబాబుతో రేవంత్ మాట్లాడి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగేలా చూడాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రంలో కీలకంగా ఉన్నారని... శనివారం నాటి ఇద్దరు ముఖ్యమంత్రులు భేటీలో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపునకు కృషి చేసే అంశంపై నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో శాసనమండలి ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. మండలి పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. మండలిలో కనీసం 40 సీట్లు ఉండాలని, అంతకంటే తక్కువ ఉండకూడదన్నారు. కానీ కేంద్రం గత టర్మ్‌లో చేసిన రాజ్యాంగ సవరణతో మండలి ఉనికి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ టర్మ్ ముగిసే వరకు ఆంగ్లో ఇండియన్ పదవీ కాలం ఉందని, దీంతో గత అసెంబ్లీ సమయం ముగిసే వరకు ఎలాంటి ముప్పు రాలేదన్నారు. కేంద్రం చేసిన సవరణ కొత్త అసంబ్లీ నుంచి అమల్లోకి వచ్చిందని... ఇప్పుడు ఆంగ్లో ఇండియన్ సభ్యుడు అసెంబ్లీలో లేరన్నారు. దీంతో ఎమ్మెల్యేల సంఖ్య 119గానే ఉందన్నారు. దీంతో రాజ్యాంగ నిబంధనల ప్రకారం కౌన్సిల్ సభ్యుల సంఖ్య 39కి పడిపోయిందన్నారు. రాజ్యాంగం ప్రకారం కనీసం 40 మంది సభ్యులు ఉండాలనే నిబంధన ఉల్లఘించినట్లుగా అవుతుందన్నారు. దీనిపై ఎవరైనా కోర్టు వెళితే వెంటనే మండలి రద్దయ్యే అవకాశం ఉందన్నారు. మండలి కొనసాగాలంటే అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగాలన్నారు. విభజన చట్టం 26 సెక్షన్ ప్రకారం తెలంగాణలో 153కు, ఏపీలో 225కు అసెంబ్లీ సీట్లను పెంచాల్సి ఉందన్నారు. గతంలో అసెంబ్లీ సీట్లను పూనర్విభజన చేయాలని కోరినా కేంద్రం స్పందించలేదన్నారు. కానీ జమ్ము కశ్మీర్ లో అసెంబ్లీ సీట్లను పెంచారని తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుతో మాట్లాడి విభజన చట్టంలో పేర్కొన్న విధంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే విధంగా చూసి తెలంగాణ మండలి కొనసాగే విధంగా చూడాలని కోరారు. శాసన మండలి అవసరమమని, పార్లమెంట్‌లో బిల్లు వచ్చిననాడు తాను సుదీర్ఘంగా ప్రసంగించానని గుర్తు చేశారు. శాసన మండలిని కొనసాగించడానికి ప్రయత్నం చేయాలని ముఖ్యమంత్రికి సూచించారు.

## నాయకుడు-ప్రతినాయకుడు అంటూ ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్



**హైదరాబాద్ పెన్ పవర్:** నాయకుడి తొలి ఢిల్లీ పర్యటన అంటూ చంద్రబాబు ఢిల్లీ టూర్ ను ప్రస్తావించిన నారా లోకేశ్... ప్రతి నాయకుడి తొలి జిల్లా పర్యటన అంటూ పిన్నెల్లిని జగన్ పరామర్శించడాన్ని ఎత్తిచూపారు. "అధికారులు, ఎంపీలు, రాష్ట్రమంత్రులతో కలిసి చంద్రబాబు కేంద్రమంత్రులతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై చర్చించారు. ప్రధానిని కలిసి ఇవీ నిర్దిష్టంగా రాష్ట్ర తక్షణ అవసరాలు అని విన్నవించారు. కానీ ప్రతినాయకుడు... అక్రమాలు, అరాచకాలలో ఆరితేరి, చివరికి పాపం పండి జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యేని పరామర్శించారు. ఎన్నికల ఫలితాల తర్వాత మాజీ సీఎం పెట్టుకున్న తొలి పర్యటన నెల్లూరు జిల్లా జైలు" అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు. ఇక, ఏపీ సీఎం మలి పర్యటన అంటూ రేపు హైదరాబాద్ లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అంశాన్ని లోకేశ్ ప్రస్తావించారు. అదే సమయంలో జగన్ మలి పర్యటన పోక్సో చట్టం కింద అరెస్టయిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ అయ్యుంటుందని అంచనా వేశారు. తెలంగాణ ముఖ్యమంత్రితో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అవుతున్నారు. విభజన చట్టంలో ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారంపై ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్నారు. మరి 1०6०4 సీట్లు వచ్చిన పార్టీ అధ్యక్షుడి మలి పర్యటన.... బాలికలను లైంగికంగా వేధించి పోక్సో చట్టం కింద అరెస్టయి కర్నూలు జైలులో ఉన్న తమ పార్టీ మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ?" అంటూ లోకేశ్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

## నేడు చంద్రబాబు, రేవంత్ రెడ్డిల భేటీ అక్కడే...!

**నేడు సాయంత్రం 4 గంటలకు ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ**

**హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు**

**హైదరాబాద్‌లో చంద్రబాబుకు స్వాగత తోరణాలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేడు సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం కానున్నారు. వీరి భేటీకి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. విభజన సమస్యలు, రెండు రాష్ట్రాల మధ్య పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించేందుకు ఇరు రాష్ట్రాల సీఎంలు రేపు హైదరాబాద్‌లో భేటీ కానున్నారు.

**చంద్రబాబు రాక... హైదరాబాద్‌లో స్వాగత తోరణాలు**

చంద్రబాబు రాక నేపథ్యంలో తెలంగాణ టీడీపీ నాయకులు హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో పలు రోడ్లపై చంద్రబాబుకు స్వాగతం చెబుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో చంద్రబాబుకు ఆహ్వాన ఫ్లెక్సీలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## వరల్డ్ కప్ గెలిచిన టీమిండియాకు రూ.11 కోట్ల నజరానా ప్రకటించిన మహారాష్ట్ర సీఎం షిండే

**మహారాష్ట్ర విధాన్ భవన్ లో టీమిండియా ఆటగాళ్లకు సన్మానం**

**హాజరైన రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, యశస్వి జైస్వాల్, శివమ్ దూబే**

**ఆటగాళ్లను ప్రశంసల్లో ముంచెత్తిన సీఎం షిండే**




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహించిన టీ20 వరల్డ్ కప్ టోర్నీలో విజేతగా నిలిచి స్వదేశానికి తిరిగొచ్చిన టీమిండియాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తాజాగా, వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా జట్టుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే రూ.11 కోట్ల నజరానా ప్రకటించారు. ముంబయిలోని మహారాష్ట్ర విధాన్ భవన్ లో టీమిండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, యశస్వి జైస్వాల్, శివమ్ దూబేలను మహారాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలోనే సీఎం ఏక్ నాథ్ షిండే టీమిండియాకు నజరానా ప్రకటించారు. కాగా, తన ప్రసంగంలో షిండే మాట్లాడుతూ, చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ ను వరల్డ్ కప్ లో టీమిండియా ఓడించడం తనకెంతో సంతోషం కలిగించిందని అన్నారు. దక్షిణాఫ్రికాతో ఫైనల్లో సూర్యకుమార్ యాదవ్ బౌండరీ లైన్ వద్ద పట్టిన అద్భుత క్యాచ్ గురించి ప్రస్తావించారు. అంతేకాదు, మహారాష్ట్ర క్రికెట్ కు చెందిన పరాస్ మాంబ్రే, అరుణ్ కనాడే టీమిండియా సహాయక సిబ్బందిగా తమ పాత్రను విజయవంతంగా నిర్వర్తించారని సీఎం షిండే అభినందించారు. గతరాత్రి ముంబయి మెరైన్ డ్రైవ్ లో లక్షలాది మంది హాజరైన టీమిండియా విక్టరీ పరేడ్ లో ఎలాంటి అపశృతులు జరగకుండా సమర్థవంతంగా ఏర్పాట్లు చేశారంటూ పోలీసులను కూడా అభినందించారు.

## స్టాక్ మార్కెట్: స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్

**భారత స్టాక్ మార్కెట్లలో నేడు ప్రతికూల పవనాలు**

**ఉదయం నష్టాలతో మొదలైన ట్రేడింగ్**

**అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులతో ప్రభావితమైన సెన్సెక్స్, నిఫ్టీ**




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టాక్ మార్కెట్లో నేడు ప్రతికూల పవనాలు వీచాయి. అంతర్జాతీయ మార్కెట్ల ఒడిదుడుకులు భారత స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీపై ప్రభావం చూపించాయి. ఇవాళ్టి ట్రేడింగ్ ఆరంభంలో నష్టాలు ఎదుర్కొన్న సూచీలు... సాయంత్రానికి కొనుగోళ్ల అండతో కోలుకున్నాయి. ముగింపు సమయానికి సెన్సెక్స్ 53.07 పాయింట్ల నష్టంతో 79, 996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 21.70 పాయింట్ల లాభంతో 24,323 వద్ద ముగిసింది. ఓఎన్జీసీ, రిలయన్స్, ఎస్బీఐ, బ్రిటానియా, సిప్లా షేర్లు లాభపడగా... హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్, టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టైటాన్, మైండ్ ట్రీ షేర్లు నష్టాలు చవిచూశాయి.

# బ్రిటన్ ఎన్నికల్లో గెలిచిన భారత సంతతి నేతలు వీరే!



**హైదరాబాద్ పెన్ పవర్:** యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. కీర్ స్టార్మర్ నాయకత్వంలోని లేబర్ పార్టీ అద్భుత విజయం సాధించింది. బ్రిటన్ పార్లమెంటులో మొత్తం సీట్ల సంఖ్య 650 కాగా.... ఇప్పటివరకు 644 స్థానాల్లో ఫలితాలు తేలాయి. లేబర్ పార్టీ 409 స్థానాలతో తిరుగులేని విజయం అందుకుంది.

ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 326 కాగా... లేబర్ పార్టీ 400కి పైగా సీట్లతో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమైంది. రిషి సునాక్ నాయకత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ 119 స్థానాలు నెగ్గింది. ఓవరాల్ గా... 330 మంది తొలిసారిగా ఎంపీలయ్యారు. ఇక అసలు విషయానికొస్తే... బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో పలువురు భారత సంతతికి చెందిన నేతలు విజయం సాధించారు. వారిలో రిషి సునాక్ కూడా ఉన్నారు. రిషి సునాక్ ఎంపీగా గెలిచినప్పటికీ, తన కన్జర్వేటివ్ పార్టీ ఓడిపోవడంతో ఆయన ప్రధాని పదవి నుంచి దిగిపోవాల్సి వస్తోంది.

**రిషి సునాక్**

ప్రస్తుతం బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధానిగా ఉన్న రిషి సునాక్ సార్వత్రిక ఎన్నికల్లో నార్తర్న్ ఇంగ్లండ్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆయన గతంలోనూ ఇదే స్థానం నుంచి నెగ్గారు. ఆయన 47.5 శాతం ఓట్లు దక్కించుకున్నారు.

దేశంలో ద్రవ్యోల్బణం పెరగడం, నిరుద్యోగ సమస్య, ఆరోగ్య బీమా అంశాలు, అంతర్జాతీయ సమస్యలపై ప్రభుత్వ వైఖరి... ఇలా అనేక కారణాలతో రిషి సునాక్ నాయకత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ పట్ల ప్రజలు ఎన్నికల్లో తీవ్ర వ్యతిరేకత కనబరిచారు.

**శివానీ రాజా**

శివానీ రాజా... లేబర్ పార్టీకి చెందిన మహిళా రాజకీయ నేత. ఆమె ఈ ఎన్నికల్లో లీసెస్టర్ (తూర్పు) నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. మాజీ ఎంపీలు, రాజకీయ దిగ్గజాలు క్లాడ్ వెబ్, కీత్ వాజ్ లీసెస్టర్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్లుగా బరిలో దిగడంతో ఇక్కడ గట్టి పోటీ నెలకొంది. అయితే, శివానీ రాజానే విజయం వరించింది.

శివానీ లీసెస్టర్ లోనే పుట్టి పెరిగారు. హెర్రిక్ ప్రైమరీ స్కూల్లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. సోర్ వ్యాలీ కాలేజ్, క్వీన్ ఎలిజబెత్-2 కాలేజీలో చదువుకున్నారు. ఆమె డి మోంట్ ఫోర్ట్ యూనివర్సిటీ నుంచి కాస్మెటిక్ సైన్స్ లో ఫస్ట్ క్లాస్ ఆనర్స్ డిగ్రీ అందుకున్నారు.

**కనిష్క నారాయణ్**

వేల్స్ ప్రాంతంలో మైనారిటీ నేపథ్యంతో ఎన్నికైన మొట్టమొదటి భారత సంతతి ఎంపీ కనిష్క నారాయణ్. నారాయణ్ భారత్ లోనే పుట్టారు. 12 ఏళ్ల వయసున్నప్పుడు ఆయన కుటుంబం బ్రిటన్ లోని కార్డిఫ్ కు వలస వచ్చింది. ప్రత్యేక స్కాలర్ షిప్ సాధించి ఈటన్ విద్యాసంస్థలో చదువుకున్న కనిష్క నారాయణ్... ఆ తర్వాత ప్రపంచ ప్రఖ్యాతఆక్స్ ఫర్డ్ వర్సిటీ, స్టాన్ ఫర్డ్ వర్సిటీలో విద్యాభ్యాసం చేశాడు.

**సువెల్లా బ్రువెర్మన్**

భారత సంతతికి చెందిన సువెల్లా బ్రువెర్మన్ ఈ ఎన్నికల్లో ఫేర్ హామ్ అండ్ వాటర్లూ విల్లా ఎంపీ స్థానం నుంచి విజయం సాధించారు. రిషి సునాక్ క్యాబినెట్లో ఆమె హోంమంత్రిగా వ్యవహరించారు. అయితే పదవీకాలం మధ్యలోనే ఉద్వాసనకు గురయ్యారు. అప్పట్లో సువెల్లా బ్రువెర్మన్ స్థానంలో జేమ్స్ క్లెవర్లీని హోంమంత్రిగా నియమించారు. లండన్ పోలీసులు పాలస్తీనా మద్దతుదారుల పట్ల అనుకూల వైఖరిని కనబరుస్తున్నారంటూ చేసిన ఆరోపణలు సువెల్లా బ్రువెర్మన్ కు ప్రతికూలంగా మారాయి.

**గగన్ మహీంద్రా**

గగన్ మహీంద్రా బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ తరఫున పోటీ చేశారు. సౌత్ వెస్ట్ హెర్ట్ ఫోర్డ్ షైర్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఆయనకు 16,458 ఓట్లు లభించాయి. ఆయన సమీప ప్రత్యర్థి, లిబరల్ డెమొక్రాటిక్ పార్టీకి చెందిన శాలీ సిమింగ్టన్ కు 12,002 ఓట్లు వచ్చాయి. గగన్ మహీంద్రా... ఓ పంజాబీ హిందు కుటుంబానికి చెందిన వ్యక్తి.

**నవేందు మిశ్రా**

నవేందు మిశ్రా స్టాక్ పోర్ట్ ఎంపీ స్థానం నుంచి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లోనూ ఆయన ఇదే స్థానం నుంచి గెలుపొందారు. నవేందు మిశ్రా లేబర్ పార్టీ నేత. ఈ ఎన్నికల్లో ఆయనకు 21,787 ఓట్లు వచ్చాయి.

**సత్వీర్ కౌర్**

బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో సౌతాంప్టన్ టెస్ట్ నియోజకవర్గం నుంచి సత్వీర్ కౌర్ జయభేరి మోగించారు. ఆమె లేబర్ పార్టీకి చెందిన మహిళా నేత. ఆమె భారీ మెజారిటీతో నెగ్గారు. సీనియర్ ఎంపీ అలెన్ వైట్ హెడ్ రాజకీయాల నుంచి తప్పుకోవడంతో ఈ ఎన్నికల్లో సత్వీర్ కౌర్ కు టికెట్ ఇచ్చారు.

## థాంక్యూ... రిషి సునాక్: ప్రధాని మోదీ ట్వీట్

**బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో రిషి సునాక్ నాయకత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ పరాజయం**

**లేబర్ పార్టీకి పట్టం కట్టిన బ్రిటన్ ఓటర్లు**

**యూకే ప్రధానిగా మీ సేవలు ప్రశంసనీయం అంటూ సునాక్ ను ఉద్దేశించి మోదీ ట్వీట్**




**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయం పాలవడంతో మరోసారి ప్రధాని కావాలన్న రిషి సునాక్ కలలు భగ్నమయ్యాయి. బ్రిటన్ లో 14 ఏళ్ల పాటు సాగిన కన్జర్వేటివ్ పార్టీ పాలనకు తెరదించుతూ... లేబర్ పార్టీ సునామీ విజయం సాధించింది. కీర్ స్టార్మర్ బ్రిటన్ తదుపరి ప్రధానమంత్రిగా గద్దెనెక్కనున్నారు. ఈ నేపథ్యంలో, భారత ప్రధాని నరేంద్ర మోదీ బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ ను ఉద్దేశించి ట్వీట్ చేశారు.

"థాంక్యూ రిషి సునాక్... యూకే ప్రధానిగా మీ సేవలు ప్రశంసనీయం. మీ హయాంలో భారత్, యూకే సంబంధాలు మరింత బలోపేతం కావడానికి మీరు ఎంతో క్రియాశీలక సహకారం అందించారు. భవిష్యత్తులో మీకు, మీ కుటుంబానికి అంతా శుభప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ మోదీ ట్వీట్ చేశారు.

# విరాట్ కోహ్లీ మొబైల్ వాల్‌పేపర్‌గా నీమ్ కరోలీ బాబా ఫొటో.. ఇంతకీ ఎవరీయన?

బాబా నీమ్ కరోలీని చాలామంది హనుమంతుని అవతారంగా భావిస్తారు
యూపీలో జన్మించిన ఈయన అసలు పేరు లక్ష్మణ్ నారాయణ్ శర్మ
చిన్నతనంలోనే సాధువుగా మారిన వైనం
తన ప్రవచనాల ద్వారా లక్షలాది మంది భక్తులను సొంతం చేసుకున్న బాబా
తాజాగా కోహ్లీ మొబైల్ వాల్‌పేపర్‌గా బాబా ఫొటో కనిపించడంతో ఎవరంటూ నెటిజన్ల వెతుకులాట



హైదరాబాద్ పెన్ పవర్: విరాట్ కోహ్లీకి భక్తి భావం కూడా ఎక్కువే. దీనికి నిదర్శనం తాజాగా కోహ్లీ ఫోన్ వాల్‌పేపర్‌గా ఓ ఆధ్యాత్మిక గురువు, కొంతమంది సాక్షాత్తు దైవస్వరూపంగా భావించే 'నీమ్ కరోలీ బాబా' ఫొటో ఉండటమే. భారత జట్టు టీ20 వరల్డ్ కప్ గెలిచి.. గురువారం స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా.. ముంబైలో విక్టరీ పరేడ్ నిర్వహించారు. అనంతరం టీమిండియాను వాంఖడే స్టేడియంలో ఘనంగా సన్మానించారు. ఇక ఈ వేడుక ముగిసిన తర్వాత విరాట్ కోహ్లీ తన భార్య, పిల్లలను కలవడానికి లండన్ వెళ్లిపోయాడు. లండన్ విమానాశ్రయంలో దిగిన తర్వాత తన డ్రైవర్‌కు గుడ్‌బై చెప్పే సమయంలోనే విరాట్ కోహ్లీ ఫోన్ వాల్‌పేపర్‌పై నీమ్ కరోలీ బాబా ఫొటో ఉండటం కెమెరా కంటికి చిక్కింది. ఆ ఫొటోను ఎక్స్ యూజర్ ముఫ్దాల్ వొహ్రా షేర్ చేశారు. దీంతో ఒక్కసారిగా నీమ్ కరోలీ బాబా ఎవరు? విరాట్ కోహ్లీ లాంటి స్టార్ క్రికెటర్ ఆయన ఫొటోను వాల్‌పేపర్‌గా పెట్టుకున్నాడంటూ క్రికెట్ అభిమానులు చర్చించుకుంటున్నారు. దీంతో ఈ ఫొటో ఒక్కసారిగా సోషల్ మీడియాలో వైరలవుతోంది.

**బాబా నీమ్ కరోలీ ఎవరంటే..!**

బాబా నీమ్ కరోలీని చాలామంది హనుమంతుని అవతారంగా భావిస్తారు. ఆయన అద్భుతాలను తెలిపే అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. హిందుస్థాన్ టైమ్స్ మరాఠీ నివేదిక ప్రకారం బాబా ప్రధాన ఆశ్రమం 1964లో కైంచి ధామ్‌లో స్థాపించబడింది. బాబా నీమ్ కరోలీ ఆశ్రమానికి యాపిల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్, ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్, హాలీవుడ్ నటి జూలియా రాబర్ట్స్ వంటివారు కూడా దర్శించారు. వీరు కూడా బాబాకు భక్తులు. ఇక యూపీలో జన్మించిన ఈయన అసలు పేరు లక్ష్మణ్ నారాయణ్ శర్మ. చిన్నతనంలోనే సాధువుగా మారారు. తన ప్రవచనాల ద్వారా లక్షలాది మంది భక్తులను సొంతం చేసుకున్నారు. 1973లోనే బాబా నీమ్ కరోలీ మరణించారు. కాగా, గతేడాది హోలీ పండుగ సందర్భంగా కోహ్లీ దంపతులు ఆయన ఆశ్రమాన్ని సందర్శించారు. ఆ తర్వాత సోషల్ మీడియా వేదికగా ఆయనకు నివాళులర్పించారు.

# రోహిత్ శర్మకు చిన్ననాటి స్నేహితుల సర్‌ప్రైజ్..



హైదరాబాద్ పెన్ పవర్: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు అతని చిన్ననాటి స్నేహితులు సర్‌ప్రైజ్ చేశారు. నిన్న ముంబై వాంఖడే స్టేడియంలో ఈవెంట్ తర్వాత అందరూ కలిసి హిట్‌మ్యాన్‌కు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పారు. ప్రపంచకప్ ట్రోఫీ అందుకునేటప్పుడు రోహిత్ చేసిన ఫన్నీ వాక్‌ను అనుకరిస్తూ సందడి చేశారు. హిట్‌మ్యాన్‌ను ఎత్తుకుని, దండ వేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వీరిలో ముంబై ఇండియన్స్ ఆటగాడు తిలక్ వర్మ కూడా కనిపించాడు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# ఈ ప్రపంచకప్ మీ కోసమే.. రోహిత్ శర్మ ట్వీట్ వైరల్!




హైదరాబాద్ పెన్ పవర్: టీ20 ప్రపంచకప్ ట్రోఫీతో స్వదేశానికి తిరిగొచ్చిన భారత జట్టుకు ముంబైలో అభిమానులు కనీవిని ఎరుగని రీతిలో అపూర్వస్వాగతం పలికారు. దీనిపై టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఎంతో ఆనందం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రత్యేకంగా ఓ పోస్టు పెట్టాడు. 'ఈ కప్ మీ కోసమే..' అని పేర్కొంటూ జాతీయ జెండాను పోస్టు చేశాడు. అలాగే తాను ఓపెన్ టాప్ బస్సులో వరల్డ్‌కప్‌ను ఎత్తుకుని ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తున్న ఫొటోను కూడా జత చేశాడు. ఇప్పుడీ ట్వీట్ వైరల్ అవుతోంది.



## బ్లాక్ డ్రెస్‌లో దివ్యాంశ కౌశిక్ స్పిల్లా మ్యాజిక్

# ఆ మెగా హీరో కోరిక సమంత తీరుస్తుందా..?



సెలబ్రిటీలకు సెలబ్రిటీ క్రష్ లు ఉంటారన్న విషయం తెలిసిందే. అప్పుడప్పుడు హీరోలు తమకు ఇష్టమైన హీరోల గురించి.. హీరోయిన్స్ తమకు ఇష్టమైన హీరోల గురించి చెబుతుంటారు. ఏదైనా షోలకు వెళ్తే వారి మనసు దోచిన సెలబ్రిటీ క్రష్ ఎవరనే ప్రశ్న తప్పకుండా ఉంటుంది. అయితే మెగా హీరో సాయి ధరం తేజ్ ఈ ప్రశ్నకు మరు క్షణం ఆలోచించకుండా సమంత పేరు చెప్పేస్తాడు. సమంత అంటే తనకు ఇష్టమని ఎన్నోసార్లు చెప్పాడు సాయి తేజ్. అయితే సమంత కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే హీరోగా సినిమాలు మొదలు పెట్టిన సాయి ధరం తేజ్ ఆమెతో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశాన్ని దక్కించుకోలేదు. సమంత పెళ్లి కాకపోతే బహుశా ఆ ఛాన్స్ ఉండేదని అనుకున్నాడు కానీ నాగ చైతన్యతో పెళ్లి అయిపోయింది. అయితే అనుకోని కారణాల వల్ల సమంత అక్కినేని ఫ్యామిలీకి దూరమైంది. చైతన్యతో విడాకుల తర్వాత సమంత చాలా సమస్యలు ఫేస్ చేసింది. ప్రొఫెషనల్, పర్సనల్ ఇలా ప్రతి దానిలో సమంత కాస్త ఇబ్బందికరమైన వాతావరణమే ఎదుర్కొన్నది. అయితే సమంత తిరిగి ఇప్పుడు మళ్లీ ట్రాక్ లోకి వచ్చింది. సమంత వరుస సినిమాలు చేసేందుకు రెడీ అవుతుంది. ఇలాంటి టైం లో సమంత ఆ మెగా హీరో విన్నపాన్ని ఒప్పుకుంటుందా. ఎలాగు సాయి ధరం తేజ్ ఫాం లో ఉన్న హీరోనే కాబట్టి అతనితో జత కట్టే ఛాన్స్ వస్తే కాదనే ఛాన్స్ లేదు. కంటెంట్ ఉన్న సినిమాలనే చేస్తాన ని సమంత చెబుతున్నా తన అభిమాని అయిన సాయి ధరం తేజ్ తో సమంత కలిసి నటించేందుకు నో చెప్పకపోవచ్చు. సాయి తేజ్, సమంత ఈ జోడీ చూడాలని మెగా ఫ్యాన్స్ కూడా ఉత్సాహం గా ఉన్నారు. సాయి తేజ్ ప్రస్తుతం గాంజా శంకర్ సినిమా చేస్తున్నాడు. ఆ తర్వాత చిత్రలహరి 2 ఉంటుందని టాక్. ఈ సినిమాలో హీరోయిన్స్ ఎవరన్నది ఇంకా తెలియలేదు. ఒకవేళ చిత్రలహరి లో ఉన్న కళ్యాణిని, నివేదాని రిపీట్ చేస్తే సమంత కు ఛాన్స్ ఉండదు కానీ వారు కాకుండా వేరే అంటే మాత్రం సమంత ఫస్ట్ ఆప్షన్ అవుతుందని చెప్పొచ్చు. ఒకవేళ ఆ సినిమా కాకపోయినా ఫ్యూచర్ లో సాయి ధరం తేజ్ చేసే సినిమాలో సమంత తప్పకుండా స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇష్టమైన హీరోయిన్ తో స్క్రీన్ షేరింగ్ అంటే ఆ కిక్ వేరేలా ఉంటుంది. మరి తేజ్ కి ఆ లక్కీ ఛాన్స్ ఎప్పుడు వస్తుందో చూడాలి.



## కృతి ఖర్బండా నాగరీకమైన ఫ్యూజన్ మంటలను సృష్టిస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com